క్లుప్తంగా

ఉద్యోగులకు క్రమబద్ధీకరణ పత్రాల అందజేత

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్న ఉద్యోగులు



నియామకపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఒంగోలు టౌన్: గత 23 ఏళ్లుగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయడం తెలిసిందే. వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. 61 మంది ఎంపీహెచ్‌ఏలు (పురుషులు), 33 మంది ఎంపీహెచ్‌ఏలు (మహిళలు), 8 మంది ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2లకు నియామక పత్రాలు అందించారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, వైద్య శాఖలో మంచిపేరు తెచ్చుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తమ సర్వీసును క్రమబద్ధీకరించడం చాలా సంతోషంగా ఉందని బి.మాచిరాజు తెలిపారు. తమ కుటుంబాలన్నీ ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏలు జి.ఈశ్వరలక్ష్మి, దరియా, ఏఎస్ రావు, కాశీ, వెంకటేశ్వరరావు, ఎంపీ సుబ్బారావు, నర్సారెడ్డి, రంగస్వామిరెడ్డి, ఎంపీ ప్రసాద్, కరీం తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు.

మహిళలకు సత్కారం



సత్కారం అందుకున్న మహిళలతో నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సభ కు అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సభలో విశిష్ట సేవలందిస్తున్న మహిళలు ఎన్.హరిప్రియ, కుసుమ కుమారి, రేఖ, తదితరులను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ బాలకొండయ్య దంపతులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తిరిగి అందిస్తున్న వలంటీర్ దివ్యాంగురాలైన రేఖను నిర్వాహకులు ధేనువకొండ సుబ్బయ్య, జాలాది మోహన్, దిగ్విజయ్, మాకా ఆంజనేయులు, ఏల్చూరి అనంతలక్ష్మి, యం.వి.వి.పి.బాబురావు, రంగారావు అభినందించారు.

వైభవంగా రథోత్సవం



త్రిపురాంతకంలో శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం



త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తజనుల హరనామస్మరణతో ఈప్రాంతమంతా మారుమోగింది. త్రిపురాంతకంలో మహాశివరాత్రి మహోత్సవాలు 6 వ తేదీ నుంచి జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాశివరాత్రి జాగారం రాత్రి స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వార్ల రథోత్సవ కార్యక్రమం వేలాదిమంది భక్తజనులు ముందుంచి నడిపించగా వైభవంగా జరిగింది. ఆలయాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు సభ్యులు, రథోత్సవం ఈఓ చెన్నకేశవరెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ శివప్రసాదర్, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ సాంబశివయ్య బందోబస్తు నిర్వహించారు.

పులి శ్రీనివాస ప్రసాద్‌కు ఐకాన్ అవార్డ్

కంభం: వివిధ సంస్థలను వేదికగా చేసుకొని గత 35 ఏళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన స్పందించే హృదయాలు ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్‌కు ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు దక్కింది. ఆదివారం ఢిల్లీలో బ్రాండ్‌మన్ ఇండియా, ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ మల్టీ మీడియా సిస్టమ్స్ వారు సంయుక్తంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు సినీ నటి సుధాచంద్రన్ చేతుల మీదుగా పులి శ్రీనివాస ప్రసాద్ అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీతను పలువురు అభినందించారు.



నరనంది వాహనంపై రామలింగేశ్వరస్వామి



రావణబ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి



ఏనుగు వాహనంపై జ్వాలాముఖి అమ్మవారు

వైభవంగా నాలుగు దేవుళ్ల గ్రామోత్సవం

మదనూరు (కొత్తపట్నం):

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపట్నం మండలంలోని మదనూరు గ్రామంలో గంగాపర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం అర్ధరాత్రి నాలుగుదేవుళ్ల గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి ఆలయానికి సాయంత్రం నుంచే భక్తులు పోటెత్తారు. ఒంగోలు నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు. గ్రామోత్సవం సందర్భంగా రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరించిన వాహనాలపై ప్రతిష్టించి ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. నరనంది వాహనంపై రామలింగేశ్వరస్వామి, రావణబ్రహ్మవాహనంపై కన్నేశ్వరస్వామి, ఏనుగు వాహనంపై జ్వాలాముఖి అమ్మవార్లను అలంకరించారు. ఈతముక్కల గ్రామంలో ముస్తాబు చేసిన గరుడ వాహనంపై అలంకరించిన అనంత కోదండరామ స్వామిని మేళతాళాలతో ఊరేగించుకుంటూ భారీ మందులు పేల్చుకుంటూ రామలింగేశ్వర ఆలయానికి తరలించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు దేవుళ్లకు పూజలు చేశారు. అలంకరించిన నాలుగు దేవుళ్ల ముందు టెంకాయలు కొట్టి ఆలయ దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాలుగు దేవుళ్లను వరుసగా ఉంచారు. అక్కడ నాలుగు దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. భారీగా మందు చెట్లు పేల్చగా భక్తులు తిలకించారు. వరుస క్రమంలో ముందుగా రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముకి అమ్మవార్లను ఉంచి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపుగా మదనూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఈతముక్కల బస్టాండ్ సెంటర్, ఈతముక్కల పురవీధుల మీదుగా రామలింగేశ్వర ఆలయానికి చేరుకున్నారు. గ్రామోత్సవాన్ని ప్రతి ఇంటి ముందు నిలిపి భక్తులు టెంకాయలు కొట్టగా ప్రసాదం, హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఆదివారం సాయంత్రానికి ఈతముక్కల రామలింగేశ్వర దేవాలయానికి గ్రామోత్సవం చేరుకుంది. భక్తులు నాలుగు దేవుళ్లకు హారతులిచ్చి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాటకచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. నాలుగు దేవుళ్ల ఉత్సవంలో ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి పాల్గొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. ఎస్సై బి.సాంబశివరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



గరుడ వాహనంపై కోదండరామస్వామి

సిద్ధం వైపే అడుగులు..!



చీమకుర్తి నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి సిద్ధం సభకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సిద్ధం సభకు వెళ్తున్న కొత్తపట్నం మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొత్తపట్నం: మేదరమెట్లలో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కొత్తపట్నం మండలం నుంచి వేలాదిగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, కార్లు ఏర్పాటు చేశారు. అల్లూరు, ఆలూరు, గాదెపాలెం, కొత్తపట్నం, గుండమాల, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, గమ్మళ్లపాలెం, ఈతముక్కల, మడనూరు, సంకువారిగుంట గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన వాహనాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు వేలాదిగా సిద్ధం సభకు చేరుకున్నారు. కొత్తపట్నం – ఒంగోలు రోడ్డంతా సిద్ధం సభకు వెళ్లే వాహనాలతో రద్దీగా మారింది.

సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి...

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా సిద్ధం సభకు తరలివెళ్లారు. చీమకుర్తి మండలం నుంచి పార్టీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. సంతనూతలపాడు మండలం నుంచి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో పార్టీలోని పలువురు నాయకుల నేతృత్వంలో భారీగా సిద్ధం సభకు తెరలివెళ్లారు.

మద్దిపాడు మండలం నుంచి...

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం సభకు కదం తొక్కారు. ప్రతి గ్రామం నుంచి వెయ్యిమందికి పైగా ఉదయం 9 గంటలకే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కొందరు యువకులు బైక్‌లపై వెళ్లారు. మద్దిపాడు నుంచి బయలుదేరిన బస్సులను పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, మరో కార్యదర్శి మోరబోయిన సంజీవరావు జెండా ఊపి సాగనంపారు.



చీమకుర్తి నుంచి వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణుల బస్

మా నాన్నను ఆశీర్వదించండి



వేడుకల్లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

- పార్టీలకు అతీతంగా పనిచేస్తారు
- మండలంలో భారీగా అభివృద్ధి పనులు చేశాం
- మహాశివరాత్రి వేడుకల్లో వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

మదనూరు (కొత్తపట్నం): మా నాన్న, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి కోరారు. కొత్తపట్నం మండలం మదనూరు గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మా నాన్న పార్టీలకు అతీతంగా పనిచేస్తారని, ఎవరికీ హాని చేయరని కొనియాడారు. వ్యక్తిగతంగా అందరికీ ఉపయోగపడతారని చెప్పారు. ఏ కష్టమొచ్చినా నేరుగా తమ దగ్గరకు వస్తే సాధ్యమైనంత వరకు సహాయపడతామన్నారు. కొత్తపట్నం మండలంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేశారని, పేద, బడుగు, బలహీనవర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నాయని వివరించారు. సంక్షేమ పథకాలన్నీ ఇలాగే అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలన్నారు. ఇప్పటికే సిద్ధం సభలు భారీగా విజయవంతమై వైఎస్సార్ సీపీ గెలుపును సూచిస్తున్నాయని తెలిపారు. లక్షలాది మంది సిద్ధం సభలకు రావడం రాజకీయ చరిత్రలో ఇదే మొదటిసారని అన్నారు. వచ్చే సంవత్సరం మళ్లీ ఇక్కడ మహాశివరాత్రి వేడుకలను విజయోత్సాహంతో భక్తిశ్రద్ధలతో మనం జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మదనూరు సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, బద్దేల ప్రమోద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, బిళ్లా చెన్నయ్య, తమలపాకుల కిషోర్, వాయల రోశయ్య, వాయల శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి ఎస్పీ స్పందన రద్దు

ఒంగోలు సబర్బన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నేడు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలు గమనించాలని కోరారు.

వైభవోపేతంగా మహాశివుని రథోత్సవం



రథం లాగుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి

దర్శి: దర్శి పట్టణంలోని శ్రీ కాశీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు రథంలో అలంకరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారి రథాన్ని లాగి శివనామస్మరణ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ...రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఒంగోలు ఆర్డీవోగా సుబ్బారెడ్డి

ఒంగోలు అర్బన్: ఒంగోలు ఆర్డీవోగా జీవీ సుబ్బారెడ్డిని నియమిస్తూ ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న సుబ్బారెడ్డిని ఆర్డీవోగా నియమించారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా పనిచేసిన విశ్వేశ్వరరావును ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆటో.. కారు ఢీకొని పలువురికి గాయాలు

దర్శి: ఆటో, కారు ఢీ కొని ఆటోలో ప్రయాణిస్తున్న పోతవరం గ్రామానికి చెందిన ఆరుగురికి గాయాలైన సంఘటన కురిచేడు రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఎస్.వెంకటేశ్వర్లు, బి. వెంకటప్పయ్య వారిని వెంటనే దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలైన వారిలో ముగ్గురు ఇంటర్ విద్యార్థులున్నారు.

శ్రీశైల బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా పొన్నూరు



శ్రీశైలం పాగాలంకరణ విశిష్టతను వివరిస్తున్న పొన్నూరు శ్రీనివాసులు

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించే పాగాలంకరణ విశిష్టమైంది. మల్లికార్జునస్వామి ఆలయ గర్భగుడికి పాగాలంకరణ చేసే క్రతువును వేలాదిగా భక్తులు వీక్షిస్తారు. అటువంటి విశిష్టమైన మహోత్సవానికి వ్యాఖ్యాతగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు శ్రీనివాసులు వ్యవహరించారు. వరుసగా రెండోసారి కూడా పాగాలంకరణ మహోత్సవానికి తనకు వ్యాఖ్యాతగా అవకాశం కల్పించిన శ్రీశైల దేవస్థానం వారికి పొన్నూరు శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. సహ వ్యాఖ్యాతలుగా తనతో పాటు డాక్టర్ మహంతయ్య, హయగ్రీవాచార్యులు వ్యవహరించారని చెప్పారు.

మహిళల ఓట్ల కోసమే బీజేపీ ప్రభుత్వం జిమ్మిక్కులు



సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఉదయిని

ఒంగోలు టౌన్: మహిళల ఓట్ల కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పేరుతో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తోందని డాక్టర్ ఉదయిని అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉదయిని ప్రసంగిస్తూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2024 నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు పెట్టే భిక్ష వలన సమానత్వం రాదని, సంఘటితంగా పోరాడినప్పుడే హక్కులు సాధించుకోగలుగుతారని చెప్పారు. మహిళా దినోత్సవాన్ని కుట్ర పూరితంగా ఒక వేడుకలా మార్చారని, పుట్టిన రోజు, పెళ్లి రోజులా దిగజార్చారని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించే స్ఫూర్తిదాయకమైన రోజుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సనాతన సంప్రదాయాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలే మహిళలకు కొన్ని హక్కులు, చట్టాలు సాధించిపెట్టాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు చెప్పారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ నాయకురాలు ఝాన్సీ, ఐద్వా నాయకురాలు బి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి గాయకులు సుజాత, యశోద పాటలు అలరించాయి.

రసవత్తరంగా వాలీబాల్ టోర్నమెంట్



మ్యాచ్‌లో పోటీపడుతున్న మహిళా క్రీడాకారులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది బస్టాండు సెంటర్‌లో నిర్వహిస్తున్న హెడ్‌మాస్టర్ ఎస్.హనుమంతరావు స్మారక రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. తొలి రెండు రోజులు కృష్ణ–గుంటూరు, నెల్లూరు–ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లు జరగ్గా, ఆదివారం మూడో రోజు వైజాగ్–ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. గ్రామీణ స్థాయిలో బాలికలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా మహిళల ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కృష్ణ–ప్రకాశం మహిళల జట్ల మధ్య బెస్ట్ ఆఫ్ పై పోటీ జరిగింది. ప్రతి పాయింట్ కోసం ఇరు జట్లు చమటలోడ్చాయి. అనంతరం వైజాగ్–ప్రకాశం, కృష్ణ–ప్రకాశం, నెల్లూరు–గుంటూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి.

రాష్ట్ర స్థాయి హాకీ విజేత కాకినాడ



ప్రథమ స్థానంలో నిలిచిన కాకినాడ హాకీ మహిళల జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన అనకాపల్లి జట్టు

- ద్వితీయ స్థానంలో అనకాపల్లి జట్టు

చీమకుర్తి: మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ సీనియర్ మహిళల పోటీల్లో కాకినాడ జట్టు విజేతగా నిలిచి ప్రథమ స్థానంలో నిలిచింది. అనకాపల్లి జట్టు ద్వితీయ స్థానంలో, అనంతపురం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీలు చివరి రోజు ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఫైనల్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు పోటీపడగా కాకినాడ, అనకాపల్లి జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో ఏపీ హాకీ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, గెలాక్సీ గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ, మారుతి, జ్ఞానేశ్వరరెడ్డి, స్కూలు గేమ్స్ సెక్రటరీ వనజ, పీఈటీ టీ.రవికుమార్‌తో పాటు స్థానిక నాయకులు గొడుగు కాలేషా, ఆకుల బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.